ప్రజాశక్తి

బుధవారం 25 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం

బాల పురస్కార్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, సాధికారత అధికారి డాక్టర్ కె.కనకదుర్గ మంగళవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ ఏడాదికి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు ధైర్యసాహసాలు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్సు, టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్న సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన, చేసిన ఐదేళ్లపైబడి, 18ఏళ్లలోపు (31వతేదీ, జులై, 2025 నాటికి) వయస్సు గల పిల్లల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె వివరించారు. దరఖాస్తులను https://awards.gov.in వెబ్‌సైట్‌లో జూలై 31 లోగా సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. సంబంధిత అర్హతలు, ఇతర సమాచారం కూడా వెబ్ సైట్‌లో లభిస్తుందని ఆమె చెప్పారు.

ప్రభుత్వ బడి చుట్టూ రాజకీయ దుమారం

- ఎత్తివేతపై జనాగ్రహం
- చదువుకు దూరం చేసే ఆలోచన
- విద్యా కమిటీ చైర్మన్ల ఆమోదం వెనుక ఎంఇఒల ఒత్తిళ్లు

ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ బడి చుట్టూ రాజకీయ దుమారం చెలరేగుతోంది. రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన బడిని దగ్గరగా చేర్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యావిధానంలో మార్పులు తీసుకొస్తూ కొత్త సంస్కరణల పేరుతో జనం నెత్తిన రుద్దుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గత ప్రభుత్వం హయాంలో జీవో నెంబర్ 117ను అమలు చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తాము అధికారంలోకి వస్తే ఈ జీవోను రద్దు చేస్తామని టిడిపి ప్రభుత్వం చెప్పినట్లు గానే చేసింది. కానీ ప్రజలను పెనం వేడి లోంచి పొయ్యిలోకి తోసే ప్రయత్నం కనిపిస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా రాష్ట్రంలో చాలా ప్రాథమిక పాఠశాలలు ఎత్తివేతకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. కొన్ని యుపి పాఠశాలలు డౌన్ గ్రేడ్ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అనేక గ్రామాల్లో ప్రజలు తమకు దగ్గరగా ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. పేదలను చదువుకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. అలాగే జిల్లాలోని బలిజిపేట మండలం పెదపెంకి ప్రాథమిక పాఠశాల -1 ఎత్తివేతకు నిరసనగా ఆ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గరుగుగుల్లి మండలంలోని హిక్కింవలస పాఠశాలను కూడా ఎత్తివేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. 40 సంవత్సరాలుగా ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎత్తివేయడంపై పెదపెంకి దళిత కాలనీ వాసులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న మరో పాఠశాలకు తమ పిల్లలను పంపించలేమని ఆందోళన చెందుతున్నారు. ఇదే క్రమంలో వారు తమ నిరసనను జిల్లా కలెక్టర్‌కు తెలియజేయడానికి ఆటోలో పెదపెంకి నుంచి పార్వతీపురం వచ్చారు. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. తిరుగు ప్రయాణంలో నర్సిపురం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్న ఆటో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కొంతమందికి తీవ్రగాయాలు, మరికొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. దీనికి రాజకీయ రంగు పులిమి లబ్ది పొందాలని అధికారపార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించారు. విద్యార్థులతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే జోగారావు స్పందిస్తూ టిడిపి నాయకుల ఆరోపణలను ఖండించారు. బడిని రాజకీయ సుడిగుండంలోకి లాగే ప్రయత్నం చేస్తున్నారు. బడి తమకు దూరమయిందనే బాధతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు.

బడుల ఎత్తివేత వెనుక ఎంఇఒల ఒత్తిళ్లు

ప్రాథమిక పాఠశాలల ఎత్తివేత, యుపి పాఠశాలల కుదింపు వెనుక స్థానిక మండల విద్యాశాఖ అధికారులే కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లపై ఒత్తిడి పెంచి అంగీకార పత్రాలపై సంతకాలు చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బలిజిపేట మండలంలోని గుడివాడ కాలనీ పాఠశాల ఎత్తివేత వెనుక ఆ మండల విద్యాశాఖ అధికారి కీలకపాత్ర పోషించారు. ఆ పాఠశాల విద్యా కమిటి చైర్మన్‌పై ఒత్తిడి చేసి సంతకం చేయించడంతో పాఠశాలను ఎత్తివేశారు. అలాగే పార్వతీపురం మండలంలోని కోరి గ్రామంలో గల యుపి పాఠశాల కుదింపు వెనుక ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడే కీలకపాత్ర పోషించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అంగీకార పత్రం అందజేసినట్లు తెలుస్తోంది. చాలా గ్రామాల్లో విద్యా కమిటి చైర్మన్లుగా నిరక్షరాస్యులు ఉన్నారు. వారిని మభ్యపెట్టి అధికారులు సంతకాలు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం తీసుకోకుండా విద్యా కమిటీ చైర్మన్లు అధికారుల ఒత్తిడికి తలొగ్గి సంతకాలు చేశారు. పంచాయితీ పరిధిలో ఉన్న రెండు, మూడు పాఠశాలలను ఎత్తివేసి ఒకచోట మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయడం వల్ల నిరుపేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

పైనాపిల్‌కు ధర లేక విలవిల

ఆందోళనలో ఆదివాసీలు

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలో పైనాపిల్ (అనాస పనస) అంటే మైదాన ప్రాంత వ్యాపారులు చెవి కోసుకుంటారు. ఎందుకంటే ఏజెన్సీలో పండిన పైనాపిల్ ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి సహజసిద్ధంగా పండుతుంది. అనాస పనస పుల్ల పుల్లగా, తియ్య తియ్యగా రుచిగా ఉంటుంది. ఘుమఘుమ వాసనతో పలకరిస్తుంది. గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేది పైనాపిల్. ఇది ఏడాదికి రెండుసార్లు పంట వస్తుంది. సీతంపేట ఏజెన్సీలో అధికంగా శంభాం, కడగండి, ముత్యాలు కుసిమి, మర్రిపాడు, పూతికవలస, దోనుబాయి, పొల్ల పరిసర ప్రాంతాల్లో ఈ ఏడాది పంట కాపుకు వచ్చింది. అయితే మంచి గిరాకీ ఉంటుందనుకున్న గిరిజనులకు నిరాశ తప్ప లేదు. మార్కెట్ ధర లేక ఆందోళన చెందుతున్నారు. ఈ పంట చేతికొచ్చి వారం రోజులు కావస్తుంది. అయితే గత ఆదివారం 15 రూపాయలకు పైగా పలికితే ప్రస్తుతం సీతంపేటలో ఈ ఆది, సోమవారాల్లో జరిగిన సంత, మార్కెట్లో రూ.10లకు ధర పడిపోయింది. ఈ పంటలను విక్రయించేందుకు గిరిజనులు ఆది, సోమవారం సీతంపేట సంతకు, శనివారం కుసిమి, బుధవారం మర్రిపాడు, శుక్రవారం పూతికవలస సంతలకు తీసుకొస్తున్నారు. వీటిని మైదాన ప్రాంత వ్యాపారులు కారు చౌకగా కొనుగోలు చేసి రాజమండ్రి, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, ఒడిస్సాలోని భువనేశ్వర్, పర్లాకిమిడి వంటి పట్టణాలకు వాహనాల ద్వారా మైదాన ప్రాంతాలకు తీసుకెళ్లి ఒక్కొక్క అనాస పనస పండును రూ.25 నుంచి రూ.40కు విక్రయించి అధిక లాభాలు పొందుతున్నారు.

సంతలో విక్రయించేందుకు తీసుకొచ్చిన పైనాపిల్

ఒక పది రూపాయలకు అడుగుతున్నారు

ఒక్కొక్క పైనాపిల్ పండు పది రూపాయలకే మాత్రమే అడుగుతున్నారు. గతంలో 15 రూపాయల వరకు ధర పలికేది. ప్రస్తుతం పది రూపాయలకే అడుగుతున్నారు. దీనివల్ల నష్టం కలుగుతుంది.

సవర కిచ్చాయి
మెట్టుగూడ, సీతంపేట మండలం.

ప్రభుత్వమే కొనుగోలు చేసి, మార్కెట్ ధర కల్పించాలి

గిరిజనుల వద్ద ఉన్న పైనాపిల్‌ను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి మార్కెట్ ధర కల్పించాలి. గిరిజనులు కొండపై పైనాపిల్ సేకరించి సంతకు తీసుకు రాగా, అక్కడ దళారీల వల్ల గిట్టుబాటు ధర లభించడంలేదు. పోనీ పట్టణాల్లోని రైతుబజార్లకు తీసుకెళ్లి విక్రయించాలంటే ఖర్చువుతుంది. కావున ప్రభుత్వమే పైనాపిల్ కొనుగోలు చేసి, మార్కెట్ ధర కల్పించాలి.

ఎం.తిరుపతిరావు,
గిరిజన సంఘం నాయకులు, సీతంపేట.

రైతు బజార్‌లో విక్రయిస్తే లాభాలు

ఇప్పటికే శ్రీకాకుళంలో 2, విజయనగరంలో 3, పార్వతీపురం మన్యం జిల్లాలో 2, విశాఖపట్నం 13 రైతు బజార్లో షాపులు ఏర్పాటు చేశాం. అక్కడికి పైనాపిల్ తీసుకొని వెళ్లి విక్రయించుకుంటే ఒక్కొక్క పండు రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతుంది.

ఎస్‌వి గణేష్,
ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి, సీతంపేట.

ఎయిమ్స్‌లో పాలకొండ వాసి ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణానికి చెందిన దండా వినోద్ కుమార్ ఎయిమ్స్ స్పెషాలిటీ పరీక్షల్లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఆలిండియా 11వ ర్యాంకు సాధించారు. తండ్రి దండా గణపతి తేజేశ్వరరావు ఆర్ఎంపి వైద్యులు కాగా, తల్లి పద్మ కుమారి గృహిణి. 1నుంచి పదో తరగతి వరకు స్థానిక ప్రైవేట్ పాఠశాలల్లోనూ, ఇంటర్ బైపిసి వైజాగ్‌లోనూ విద్యను అభ్యసించారు. శ్రీకాకుళం రిమ్స్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో కోర్సు పూర్తి చేసే రాగోలు జిమ్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు.

భవానిపట్నం రైలులో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిశా నుంచి ఆంధ్రాలోకి గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు పార్వతీపురం రూరల్ సిఐ ఎస్.గోవిందరావు అన్నారు. మంగళవారం కూనేరు రైల్వే స్టేషన్లో భవానీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్లే ట్రైన్‌లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీసులు జిఆర్పి పోలీసులు ఆర్పిఎఫ్, ఎస్ టి ఎఫ్ బృందాలతో రైల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి మత్తు పదార్థాలు రవాణా జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయమని తెలిపారు. ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగులను డాగ్ స్క్వేడ్‌తో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానత బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విడిచిపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల్లో కొమరాడ ఎస్సై నీలకంఠం, జిఆర్‌పి ఆర్‌పిఎఫ్, ఎస్‌టిఎఫ్ పోలీసులు ఉన్నారు.

రైలులో డాగ్ స్క్వేడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

28న సాలూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 28న ఉదయం 9గంటలకు జాబ్ మేళా జరగనుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 28 ఏళ్ల ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 28న జాబ్ మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలోకి ఎంపిక చేసుకోవడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఆ రోజు ఉదయం 9.00గం.లకు హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94947 77553, 73825 59022 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

డిఎ జుగాకు విశేష స్పందన : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జెజియుఎ) కార్యక్రమం జిల్లాలో బాగా జరుగుతుందని, గిరిజన ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 30 వరకు డిఎ జుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతిని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో గిరిజనులు తమకు కావాల్సిన అవసరాలను, ధ్రువపత్రాలను, మౌలిక వసతులను ఎక్కువగా కోరుతున్నట్లు చెప్పారు. అలాగే పిఎం జన్ మన్ గృహాలను కోరుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలతో గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని అన్నారు. గ్రామ/ క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించేలా జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30 వరకు గిరిజనులకు అవసరమయ్యే ఆధార్, రేషన్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ పథకాల ప్రయోజనాలను గిరిజనులు వినియోగించుకోవాలని కలెక్టర్ వివరించారు. పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ/ క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో కార్యకలాపాలు చేపట్టాలని అన్నారు. ఆధార్, ఇ - కెవైసి డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఆధార్‌లో నమోదు కాని వారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని, గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సమావేశంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఒపై చర్యలకు చైర్‌పర్సన్‌కు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూవిభాగంలో ఆర్‌ఒగా విధులు నిర్వహిస్తున్న డి.రూబెన్ వ్యవహార శైలి ఏమాత్రం బాగాలేక పోవడంతో కార్యాలయంలోని మహిళా ఉద్యోగినులతో పాటు పలువురు ఉద్యోగులు మంగళ వారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసానికి వెళ్లి ఆయనపై ఫిర్యాదు చేసి, వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులపై అసభ్య పదజాలాలతో మాట్లాడుతున్నారని, దీనివల్ల వారు ఎంతో మనోవేదనకు గురవుతున్నామని, తమ విధులను సక్రమంగా నిర్వహించ లేకపోతున్నామని, ఆయనపై చర్యలు తీసుకోకపోతే తాము విధులకు హాజరు కామని అన్నారు. చైర్‌పర్సన్ స్పందించి బుధవారం కార్యాలయానికి వచ్చి అందరి సమక్షంలో ఆర్‌ఒను విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డ్రోన్‌తో దోమల మందు పిచికారీ

మలేరియా నియంత్రణకు ఆధునిక సాంకేతికత

ప్రజాశక్తి - కురుపాం

ఆధునిక సాంకేతిక పద్ధతులతో జిల్లాలో మలేరియా నియంత్రణకు నాంది పలకనున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. డ్రోన్ సాయంతో దోమల మందు పిచికారీని (ఎఎల్ఒ) గుమ్మలక్ష్మీపురం మండలం గౌడుగూడలో మంగళవారం తొలి ప్రయత్నంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ, ప్రోగ్రాం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. గ్రామ పరిసరాల్లో గల పెద్ద నిల్వ నీటి కుంటలపై యాంటీ లార్వల్ ఆపరేషన్‌ను డ్రోన్ సాయంతో చేపట్టారు. ముందుగా దోమల మందు టెమిఫాస్ మిశ్రమాన్ని కలిపి డ్రోన్‌లో నింపారు. దోమల లార్వా నియంత్రణకు అక్కడ ఉన్న నీటికుంటలపై వ్యాప్తి చెందేలా డ్రోన్‌తో స్ప్రేయింగ్ నిర్వహించారు. అనంతరం డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో దోమల నివారణా చర్యలకు సాంకేతిక విధానం దోహదపడుతుందని, ఆ దిశగా తొలి ప్రయత్నంగా గ్రామంలో చేపట్టినట్టు తెలిపారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. గ్రామాల్లో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

వసతిగృహ పర్యవేక్షణ

అనంతరం టిక్కబాయిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను డిఎంహెచ్ఒ సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. హాస్టల్‌లో స్ప్రేయింగ్ ఏ మేరకు నిర్వహించారో గదులను పరిశీలించారు. విద్యార్థుల సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం తాడికొండ పిహెచ్‌సి తనిఖీ చేశారు. అక్కడ రోగులతో మాట్లాడి ఆరోగ్య స్థితి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిఎల్‌ఎటిఒ డాక్టర్ వినోద్, వైద్యాధికారి డాక్టర్ అభిలాష్, మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల సందర్శన

కురుపాంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఏకలవ్య ప్రిన్సిపల్ యోగేంద్ర బహుదూర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో దోమల నివారణలో భాగంగా ఎసిఎం స్ప్రేయింగ్ నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని మాదలింగి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తనూజను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.

డ్రోన్ ద్వారా మలాథియాన్ పిచికారీని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పాచిపెంట

జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, జూన్ 27న జరిగిన జీపు జాతను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శ్రామిక మహిళ నాయకులు కె.పార్వతీదేవి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నాయుడు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ లేబర్ కోర్టులను తీసుకొచ్చిందన్నారు. కార్పొరేట్, పెట్టుబడుదారులకు లాభాలు చేకూర్చే విధానాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం కార్మిక వర్గానికి, ఉద్యోగులకు తీరని ద్రోహం చేయడమేనని అన్నారు. అతి తక్కువ జీతాలతో పనిచేయడం, పని భద్రత లేకపోవడం వంటి అనేక సమస్యలతో కార్మికులు నేడు సతమతమవుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. 8 గంటల పని దినాన్ని, పోరాడి సాధించుకున్న హక్కుల్ని కాలరాయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని కూడా నాశనం చేసే విధానాలను తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కార్మికులంతా ఐక్యంగా పోరాడి ఉద్యమించాలన్నారు. అలాగే అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడం అనేది జరుగుతుందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారితో పాటు అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికు లు అనేకమంది తమ హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేయాలని, అందులో భాగమే జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఆర్ఎ, అంగన్‌వాడీ, ఆటో, హమాలీ, గిరిజన సంఘాల నాయకులు అశోక్‌బాబు, సుగుణమ్మ, దీసర వసంతరావు, రంజిత్ కుమార్, శ్రీనివాసరావు, నారాయణరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : దేశంలో నరేంద్ర మోడీ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేసే వరకూ పోరాటాలు ఉధృతంగా కొనసాగిస్తూనే ఉంటామని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు స్పష్టం చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా, నరేంద్ర మోడీ విధానాలకు వంత పాడుతూ, పనిగంటలు పెంచాలని ఆలోచనలో ఉందని, అలాంటి నిర్ణయాలు నిలిపివేసి, ఎన్నికల ముందునాటి హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కేంద్ర విధానాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై కూడా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధపడుతుందని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు వై.గౌరీశ్వరిదేవి, షేక్ షబానా, ఈశ్వరరావు, శశికళ, శేఖర్, హరిబాబు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : జూలై 9 న జరుగు దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మె నేపథ్యంలో పార్వతీపురం పారిశుధ్య రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న మేనేజర్ లక్ష్మికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసేందుకు రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు. ప్రస్తుతం అమలవుతున్న ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు, ఉద్యోగులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర సరుకులు ధరలు అదుపు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్న డిమాండ్లతో జూలై 9న దేశ వ్యాప్త కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని ఆ సమ్మెను జయప్రదం చేసేందుకు అన్ని రంగాల కార్మికులు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకరరావు, మల్లేశ్, మామిడి శివ, పదాల సంతు, ఇప్పలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పార్వతీపురంలో సమ్మె నోటీసులను మున్సిపల్ అధికారికి అందజేస్తున్న కార్మికులు

శిథిలావస్థలో ఉన్న సచివాలయాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సచివాలయాన్ని ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం

నిర్మాణం పూర్తయిన డంగబద్ర సచివాలయాన్ని వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. జియ్యమ్మవలస మండలంలో డంగబద్ర సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న అద్దె సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని వర్షానికి కారిపోతూ పెచ్చులూడుతోందని, ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సచివాలయ భవనం నిర్మాణ పూర్తయి చిన్నచిన్న పనులు ఉన్నాయని, అవి పూర్తి చేసి వెంటనే కొత్త సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని కోరారు. అలాగే వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ వర్షాకాలంలో అద్దె భవనంలో సచివాలయం నడిపితే కచ్చితంగా ప్రమాదం పొంచి ఉంటుందని, కావున ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి సచివాలయం ప్రారంభించాలని గంగునాయుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం, నాయకులు బి. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి

లక్ష్మీపురం ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్‌ను సక్రంగా చేయాలని సూచించారు. అబ్బా ఐడి క్రియేట్ చేయాలన్నారు. జననీ మిత్ర అప్లికేషన్లు పరిశీలించారు. అదే విధంగా ఆర్‌సిహెచ్ టు జీరో అప్లికేషన్లు పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెదఅంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి సాయి రమ్యశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాలకు సేవలు మౌలిక వసతులు కల్పనే డిఎ జుగా కార్యక్రమం ధ్యేయమని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలోని పొడి గ్రామంలో మంగళవారం డిఎ జుగా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ చంద్రశేఖర్, ఎపిఎం బి. వెంకట్, వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, వెటర్నరీ వైద్య అధికారి కె.శైలజ, వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

తన డి-పట్టా భూమిని తనకు అప్పగించి సమస్య పరిష్కరించాలని మండలంలోని డికె పట్నం గ్రామానికి చెందిన గిరిజన మహిళ సిమిడి సాయి కోరింది. ఈ మేరకు ఆమె, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఆమె బంధువు రాముతో కలిసి మాట్లాడారు. తన తల్లి మారుకొండ రాములమ్మ పేరిట ఉన్న "డి పట్టా" భూమిని గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సుమారు 50 సెంట్లు తమ భూమి అని మరో వ్యక్తికి అమ్మేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో మా భూమి సర్వే చేసి హద్దులు రాసి తనకు అప్పగించాలని కోరారు. నెల రోజుల క్రితం పార్వతీపురం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అమ్మిన వారిపై" పి ఓ టీ "కేసు నమోదు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించినా ఎటువంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రంజిత్ కుమార్ మాట్లాడుతూ భూ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

9మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటి సీట్లు

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటి సీట్లు లభించినట్లు ప్రధానోపాధ్యాయులు రోజా రాణి తెలిపారు. ఆర్ జ్యోత్స్న, సిరి చందన. జి.శిరీషకు నూజివీడు ట్రిబుల్ ఐటిలోనూ, వి.సుప్రియ, సిహెచ్ తనూజ, బి.ఉజ్వల, ఎం.దివ్య, బి.దినేష్, డి.నందినిలకు శ్రీకాకుళం ట్రిబుల్ ఐటిలో సీట్లు లభించినట్లు ఆమె వెల్లడించారు. సీట్లు సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల అధ్యాపక బృందం అభినందించింది.

సీతంపేట : మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని సవర జస్పికు ఇటీవల విడుదల చేసిన నూజివీడు ట్రిబుల్ ఐటిలో సీటు రావడంతో ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, డిడి అన్నదొర, డిప్యూటీఇఒ రామ్మోహన్ రావు అభినందించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు ఉన్నట్లయితే తక్షణమే తమకు ఫిర్యాదు చేయడంతో పాటు వారి నుంచి రక్త పూతలు సేకరించాలన్నారు. ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతికుమారి, సుభారత మనీ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనార్థాలపై వివరించారు. ఎక్కడైనా క్రయ, విక్రయ జరిగినా, అక్రమ రవాణాకు పాల్పడితే తెలియజేయాలని అన్నారు. సమాజాన్ని మత్తు నుంచి కాపాడే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, కళాశాల సిబ్బంది డి.రామకృష్ణ, బి.అనురాధ, కె.శాంతి విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకమ్మ గూడలో యాంటీ లార్వా ఆపరేషన్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని నాయకమ్మగూడలో డ్రోన్ ద్వారా యాంటీ లార్వల్ ఆపరేషన్ నిర్వహించారు. దీని ద్వారా మలేరియా దోమల్ని నివారించి, తద్వారా మలేరియా జ్వరాలను నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి పివి సత్యనారాయణ, స్థానిక సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, సర్పంచ్ బి.అప్పారావు, సెక్రటరీ మహేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు

'శ్రీ విజయ'లో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో గల శ్రీ విజయ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవలు పాలకొండకే కొండంతఅండగా నిలుస్తున్నాయని పలువురు అంటున్నారు. ఏజెన్సీ ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న పాలకొండకు వైద్యరంగం విస్తరించాల్సిన అవసరం ఉంది. అయితే రెండేళ్ల క్రితం దూబ పద్మావతి కలిగిన ఆలోచనతో ఈ హాస్పిటల్ కార్యరూపం దాల్చింది. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసలు పడి, ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి శ్రీ విజయ ఆసుపత్రి కొండంత ఊరటనిచ్చిందని చెప్తున్నారు. ముఖ్యంగా పాలకొండతో పాటు సీతంపేట, వీరఘట్టం తదితర మండలాల పరిసర ప్రాంతాల్లో గర్భిణీలకు సేవలందించడంలో ఎంతో ప్రయోజనకరంగా మారింది. అలాగే తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఆర్థోకు సంబంధించిన కేసులు కూడా గతంలో ఎక్కడి నుంచి శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీలో ఆర్థోపెడిక్ ఉండడంతో ఆరోగ్యశ్రీలోనే ఉచితంగా శస్త్ర చికిత్స చేయడంతో ఈ ప్రాంత వాసులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది. అలాగే అనేక మంది గర్భిణీలు రక్తహీనత సమస్యతో హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్నప్పటికీ విజయ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు చేయించి ఈ ప్రాంతవాసుల్లో మంచి పేరు సంపాదించుకున్నారు.

9 విభాగాల్లో సేవలు

శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో 9 విభాగాల్లో 24 గంటలు సేవలందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్, గైనిక్, చిన్నపిల్లల వైద్యులు, నెఫ్రాలజీ, యూరాలజీ, ఇఎన్‌టి తదితర విభాగాల్లో వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సేవలందిస్తున్నట్లు ఆసుపత్రికి వెళ్లిన రోగులే చెప్తున్నారు విజయ ఆసుపత్రిలో రెండేళ్లుగా అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఒక రోగికి వెన్నుముక రీప్లేస్మెంట్ చేసి విజయం సాధించారు. గైనిక్ విభాగంలో ప్రి మెచ్యూర్ బేబీలు కూడా డెలివరీలు చేసి విజయం సాధించారు.

పాలకొండలో వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతోనే ఆసుపత్రి ఏర్పాటు

పాలకొండలో వైద్య సేవలందించాలనే ఉద్దేశంతోనే ఆసుపత్రి నిర్మించాం. ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ ప్రాంత వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలందించి ఇక్కడ ప్రజలను ఆదుకోవాలని కృషి చేస్తున్నాం. తాజాగా గుండెకు సంబంధించిన వ్యాధులకు ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రెండు గంటల వరకు పరీక్షలు చేస్తున్నాం. కేవలం రూ.3వేలకే ఇసిజి, ఎకో టిఎంటి తదితర పరీక్షలు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని సంబంధిత రోగులు వినియోగించుకోవాలని కోరుతున్నాం.

డాక్టర్ దూబ పద్మావతి,
మేనేజింగ్ డైరెక్టర్,
శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

ప్రజా ప్రతినిధులకు అభివృద్ధి పనులు తెలపాలి

వ్యవసాయశాఖ, ఉపాధిహామీ పనులపై సభ్యులు ధ్వజం

ప్రజాశక్తి - సీతంపేట

వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న గ్రామీణ వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, విత్తనాలు అరకొరగా వస్తున్నాయని, అలాగే ఉపాధి హామీ పథకంలో చేసిన ఇంకుడు గుంతల పనులకు ఏడు నెలలైనా బిల్లులు చెల్లించలేదని పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ధ్వజమెత్తారు. మండల సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక వైటిసిలో ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామానికి ఎన్ని క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయో సర్పంచులకు తెలియడం లేదని పెద్దూరు సర్పంచ్ హిమరక ఆదిలక్ష్మి ధ్వజమెత్తారు. ఎకరానికి బస్తా ఇస్తే మిగతా వారి పరిస్థితి ఏమిటని ధారపాడు సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ, శంభాం సర్పంచ్ తిరుపతిరావు నిలదీశారు. చిన్నపల్లక సర్పంచి సుమలత మాట్లాడుతూ విత్తనాలు కొరతపై విఎఎలు స్పందించడం లేదని ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీలకు సరిపడా విత్తనాలు రాలేదని పెదరామ సర్పంచ్ కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి ఎన్ని వాహిణి మాట్లాడుతూ విత్తనాలకు మళ్లీ ప్రతిపాదనలు పంపించామని, రాగానే సరఫరా చేస్తామని, విఎఎలు అందుబాటులో ఉంటారని బదులిచ్చారు.

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రోడ్లు, ఇంకుడు గొయ్యిలు, పాఠశాలల ప్రహరీగోడల నిర్మాణ పనులు చేసి ఏడు నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదని ధారపాడు సర్పంచ్ జీలకర సుందరమ్మ అధికారులను నిలదీశారు. సీతంపేట సర్పంచ్ కళావతి, కిల్లాడ ఎంపీటీసీ గన్నమ్మ ఇంకుడు గుంతలు బిల్లులు చెల్లించలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎపిఒ సాగర్ మాట్లాడుతూ బిల్లులు అప్లోడ్ చేశామని చెప్పగా, ఎన్నిసార్లు అప్లోడ్ అవుతాయని సభ్యులు నిలదీయడంతో ఎంపిడిఒ మిశ్రా కలుగజేసుకొని బిల్లులు అప్లోడ్ చేశామని త్వరలోనే వస్తాయని చెప్పారు. ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయని, ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక్కడే ఉంటున్నారని, వెంటనే మరో వైద్యాధికారిని నియమించాలని సర్పంచి సర్పంచ్ కూరంగి వెంకినాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. గంజాయి మత్తులో యువత దొంగతనాలు బారిన పడుతున్నారని, దీన్ని కట్టడి చేయాలని వైస్ ఎంపిపి కె.సరస్వతి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎస్ఐ సంజీవ్ చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మి, జడ్పిటిసి ప్రతినిధి రాము, సర్పంచులు నిమ్మక తిరుపతిరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ మల్లేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ రామకృష్ణ, సిడిపిఒ అమ్మాలమ్మ, ఎఇలు నాగభూషణం, సత్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 36 అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జీవో 36ను వెంటనే అమలు చేయాలని, అలాగే జీతాలు ప్రభుత్వ పరంగా వచ్చేలా చేయాలని జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఉద్యోగుల యూనియన్ (పిఎసిఎస్) అధ్యక్షులు ఆర్.సత్యారావు, ఎఐటియుసి పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మన్యం జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని 35 పిఎసిఎస్‌ల్లో విధులు నిర్వహిస్తున్న 102మంది సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా డిసిసిబి కార్యాలయం వద్ద గత మూడు రోజులుగా నిరసనను వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 35 పిఎసిఎస్‌ల్లో సుమారు 102 మంది వివిధ హోదాల్లో పనిచేస్తూ రైతులకు అవసరమైన పరపతి, ఎరువులు రైతులు పండించిన పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తూ రైతులను దళారుల నుంచి కాపాడుతున్నారని, అయితే వీరి పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. మన్యం జిల్లా సహకార అధికారి సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలకు బదులుగా అడ్వాన్సులు ఇవ్వడాన్ని అధికారుల నిరంకుశత్వాన్ని నిరసిస్తున్నామన్నారు. మార్చి 31 2024 వరకు ఉన్న జీతాలను సర్-చార్జ్ చేయమని ఆదేశాలు జారీ చేశారని, కావున వారికి న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.పాండురంగారావు, సిరిపురపు నారాయణరావు, హరీష్, పి.నాగభూషణరావు, గొర్లి చంటి, సింహాద్రి కిరణ్ అధిక సంఖ్యలో జిల్లాలోని పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీధుల్లో బ్లీచింగ్ జల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

పరిశుభ్రం చేసి.. బ్లీచింగ్ పౌడర్ వేసి..

ప్రజాశక్తి కథనానికి స్పందన

మక్కువ : స్థానిక మేజర్ పంచాయతీ మక్కువ రెల్లివీధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 23న ఆ వీధివాసులకు తప్పని అవస్థలు అన్న 'ప్రజాశక్తి' వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ విస్తరణ అధికారి బెహరా శ్రీనివాసరావు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వీధిలో పేరు పోయిన చెత్తాను, కాలువల్లో పేరుకుపోయిన పూడికలను పారిశుధ్య కార్మికులచే తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు ఆయన సూచించారు.

పూరీ మాదిరిగా రథయాత్ర

ప్రజాశక్తి - పాలకొండ

ఒడిశాలోని పూరీ మాదిరిగా ఈనెల 27 నుంచి జరగనున్న రథయాత్ర ఉత్సవాలు ఘనంగా జరపాలని నగర పంచాయతీ సమన్వయ కర్త పల్లా కొండలరావు అన్నారు. మంగళవారం ఆయన ఆలయం దగ్గర వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. రథాన్ని కూడా పరిశీలించి ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. యాత్ర నిర్వహణకు పూర్తిస్థాయి సహకారాలు అందిస్తానని వచ్చిన యాత్రలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. గుగ్గిలం కలపతో రథం చేయించమని, మళ్లీ మరమ్మతులకు గురవ్వడంపై అసంతృప్తి చెందారు. బాధ్యతగా పనిచేయాలని దేవదాయ శాఖ సిబ్బందికి సూచించారు. దీంతో పాటు టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, అనిల్ దత్తు, అంపోలు శ్రీనివాసు, బల్ల వెంకట్రావు, లోడగల సీతారాం తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

అండర్ -18 కబడ్డీ పోటీలకు బయలుదేరిన క్రీడాకారులకు మంగళవారం కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లా కొండలరావు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కిట్లు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు పతకం సాధించాలని క్రీడాకారులను కోరారు. క్రీడలు అంటే ఎంతో ఆసక్తిని, అందుకే క్రీడాకారులకు తన వంతు సహాయం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడీ అసోసియేషన్ కార్యదర్శి వెన్నపు శేఖర, సత్య సాయి ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ దూబ వెంకటరమణ, విశ్రాంతి ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి తదితరులు ఉన్నారు

పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసు లివ్వండి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మంగళవారం చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. పట్టణంలో అభివృద్ధి పనుల కోసం రూ.2కోట్లు మంజూరయ్యాయని, వాటితో పనులు ఎంతవరకు వచ్చాయని కౌన్సిలర్లు గిరి రఘు, రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ ప్రశ్నించారు. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని డిఇ ప్రసాద్ చెప్పారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. శ్యామలాంబ పండుగ నేపథ్యంలో అభివృద్ధి పనులు చేయడానికి కౌన్సిల్‌లో ఆమోదం తెలిపినా తెలపలేదని టిడిపి నాయకులు చేసిన ఆరోపణలకు అధికారులు ఎందుకు ఖండించలేదని వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్ గిరి రఘు నిలదీశారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

రెండు గిరిజన గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన రహదారిని ఆక్రమించిన రైతు సూర్య ప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని, గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండలంలోని అంటివలస - దేవుకోన మధ్య రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు వినతిని మంగళవారం అందజేశారు. అనంతరం దేవకోన సర్పంచ్ శ్రీరామవిజయ, సాంబమూర్తి మాట్లాడుతూ పూర్వాకాలం నుంచి అంటివలస-దేవుకోన మధ్య గోర్జ ఉండేదని, దీని గుండా పండించిన పంటలు తీసుకెళ్లేవారమని తెలిపారు. అయితే ఇదే గ్రామానికి చెందిన కరకవలస సూర్య ప్రకాష్ ఈ గోర్జను తను పొలంలో కలుపుకుంటూ తమను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తమకు రహదారి ఉండాలి కదా అని అడిగితే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తమపై తప్పుడు ఫిర్యాదు చేస్తూ భయపెడుతున్నారని అన్నారు. కావున వెంటనే ఈ మార్గాన్ని సర్వే చేసి తమకు రహదారి కల్పించి, సూర్య ప్రకాష్ నుంచి ఎటువంటి వివాదం లేకుండా అన్ని విధాలా భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దేవకోన, అంటి వలస గ్రామాలకు చెందిన గిరిజన యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజకీయాలకు విద్యార్థుల భవిష్యత్తును బలి చేయడం దారుణం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వైసిపి నాయకులు రాజకీయాల కోసం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును బలిచేయడం దారుణమని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆవేదన వెలిబుచ్చారు. నియోజకవర్గంలోని పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే రాజకీయ నిరసన కార్యక్రమం కోసం తీసుకెళ్లగా వారు తిరిగి వస్తూ ప్రమాదానికి గురై ఏడుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని అన్నారు. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడం విచారకరమన్నారు. రాజకీయాల్లోకి విద్యార్థులను తీసుకురావడం చట్ట విరుద్ధమని దీనికి బాధ్యులైన మాజీ ఎమ్మెల్యేతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైసిపి నాయకుల కుట్ర రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

బకాయి జీతాలు చెల్లించండి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మూడు నెలల జీతాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, హాస్పిటల్ నాయకులు చంద్రమౌళి, కుమారమ్మ, శంకర్రావు, బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రి వద్ద కార్మికులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా హాస్పిటల్లో శానిటేషన్ వర్కర్లు తగినంత మంది పని ఒత్తిడి పెంచారని, వెంటనే ఆసుపత్రికి శానిటేషన్ వర్కర్లను పెంచాలని అన్నారు. జిల్లా ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్వైజర్ సెక్యూరిటీ తదితరులకు గత మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా వారి చేత వెట్టిచాకరీ చేయించుకుంటూ కాలం గడుపుతున్న కాంట్రాక్టర్‌పై అధికారులు వెంటనే స్పందించాలని, లేనిచో ఆసుపత్రి విధుల నుంచి బయటకు వచ్చి నిరసన చేపడతామని హెచ్చరించారు. దాదాపు ఏడాది పిఎఫ్ ఖాతాలో జమ చేయాల్సిన బకాయిలను జమ చేయకుండా కాంట్రాక్టర్ తాత్సారం చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - కురుపాం

సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే సిబ్బంది అందుబాటులో ఉండాలని స్థానిక తహశీల్దార్ కె.జయ అన్నారు. మండలంలోని గొటివాడ సచివాలయాన్ని మంగళవారం సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలు గూర్చి ఆరా తీసి రికార్డులను పరిశీలించి లోటుపాట్లు గురించి సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని రేషన్ డిపోను సందర్శించి స్టాకు వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో రేషన్ అందించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ సందర్శించి దాని పరిధిలో గల గ్రామాలు ఓటర్ల వివరాలను బిఎల్‌ఒలకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ ఎ.సురేష్ కుమార్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి తీరు సరికాదు

పాలకొండ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీరు సరిగ్గా లేదని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆయన పర్యటనలో పార్టీ కార్యకర్తనే కారుతో తొక్కించి వెళ్లడం బాధాకరమన్నారు. సినిమా డైలాగులు చెప్పి రెచ్చగొట్టే ధోరణలో కూడా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికే ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పారని, అయినప్పటికీ ఆయనలో మార్పు రాలేదని అన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహశీల్దార్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.సాయి కామేశ్వరరావు మంగళవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, ఆర్ఐ ఎస్.మారుతీ రావు, విఆర్వోలు రాజేంద్ర ప్రసాద్, రఘు నాయుడు తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆటో బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం. పట్టణంలో మూడో వార్డులో వివేకానంద కాలనీకి చెందిన పతివాడ శ్రీను (46) బైక్‌పై వివేకానంద్ కాలనీలో ఉన్న తన ఇంటి నుంచి వస్తుండగా, రాయగడ రోడ్డు ప్రధాన రహదారి వద్ద తాళ్ల బురిడికి చెందిన ఆటో బైకును ఢీకొంది. దీంతో శ్రీను ప్రధాన రహదారిపై ఉన్న సెంటర్ డివైడర్‌కు ఢీకొన్నాడు. వెంటనే స్థానికులు జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకువెళ్లే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలికి చెందిన సవరపు మనోజ్ (18) రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బొబ్బిలి రైల్వే పోలీసులు బి.ఈశ్వరరావు అందించిన వివరాలు ప్రకారం చినభోగిలి గేటు సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఉండొచ్చని మధ్యాహ్నం సమయంలో గాయాలతో ట్రాక్ పక్కన పడి ఉన్న యువకున్ని రైల్వే కీమాన్ గుర్తించి స్థానిక గేట్ మాన్‌కు సమాచారం ఇచ్చాడు. అప్పటికే స్థానికులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కొంతమంది చినబోగిలికి చెందిన సవరపు మనోజ్‌గా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. 108 వాహనం ద్వారా పార్వతీపురం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సవరపు కృష్ణారావు, పార్వతిల రెండో కుమారుడు మనోజ్, ఇంటర్ పూర్తిచేసి ఇటీవల బిఎస్సి నర్సింగ్ కోసం ఎంసెట్ రాశాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవి దున్నల దాడిలో గిరిజనులకు గాయాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని డీసెర్లం పంచాయతీ పరిధిలోని లోవర కండి గ్రామానికి చెందిన గిరిజనులు అడవి దున్నల దాడిలో గాయపడ్డారు. సోమవారం ఎప్పటిలాగే పొలం పనులకు వెళ్లిన సాగరపు నారాయణ, సాగరపు పార్వతమ్మ పనులు చేసుకుంటుండగా ఎక్కడ నుంచి వచ్చాయో తెలియని అడవి దున్నలు ఇరువుర్ని గాయపర్చాయి. తీవ్ర గాయాలు పాలైన గిరిజనులను పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఇప్పటి వరకు ఈ దున్నలను చూడలేదని ఈ ప్రాంత గిరిజనలు ఆందోళన చెందుతున్నారు. పనులు చేసుకునేందుకు ఈ సంఘటన చూసిన తర్వాత గిరిజనులు బెంబేలెత్తుతున్నారు. అటవీ అధికారులు వెంటనే స్పందించి రక్షణ కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బొలేరో

ప్రజాశక్తి- కొమరాడ

అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం ఒకసారి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి కోనేరు వైపు వెళ్తున్న బొలెరో వాహనం గుమ్మడ గ్రామ సమీపం వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో బొలెరోలో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, లేకపోతే ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ఇటీవల కాలంలో ఒడిశా నుంచి ఆంధ్రాలోకి పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్న నేపథ్యంలో బొలెరో వాహనాలపై మితిమీరను వేగంతో ప్రయాణాలు చేస్తున్నారని, ఇలాంటి ప్రమాదాలు అనేకం జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కె.వెంకటాపురంలో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ నవధాన్యాల సాగువల్ల వచ్చే భూసార విలువల గురించి రైతులకు వివరించారు. వరి నారు వేసే ముందుగా పొలంలో నవధాన్యాలు జల్లి సరైన సమయంలో భూముల్లో కలిపి దున్నడం వల్ల పంట దిగుబడి ఎక్కువ వస్తుందన్నారు. అలాగే ఎరువుల వాడకం కూడా తగ్గుతుందన్నారు. అనంతరం పక్షి రొట్ట విత్తనాలు, జీలుగులు, నువ్వులు, కట్టెలు, పిల్లి పెసర, ఉలవలు, గోగుకూర, మొక్కజొన్న, పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మణరావు, విఎఎస్ యశ్వంత్, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంగాపురంలో పొలం పిలుస్తుంది

బలిజిపేట : మండలంలోని వెంగాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎఒ శ్రావణ్‌కుమార్ పొలంబడి కార్యక్రమం గురించి చర్చించి, భూ సాగుదారు హక్కు పత్రాలు గురించి వివరించారు. భూసార పరీక్ష ఫలితాలు ప్రకారం ఎరువులు వాడాలన్నారు. నవధాన్యాల విశిష్టతను వివరించారు. వరి ఎదలో సస్యరక్షణ చర్యలు చెప్పడం జరిగింది. పశు సంవర్ధక శాఖలో నీలి నాలిక, జబ్బ వాపు వ్యాధికి వాక్సినేషన్ వేస్తామని, వీటిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గులిపల్లి మురళి, వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ , గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ కీర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

పాచిపెంట : రైతులు చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని ప్రభుత్వం చోడి పంటకు మంచి మద్దతు ధర ప్రకటించిందని, రైతులు దళారులను నమ్మి పంటలు వేయొద్దని గొట్టూరు సర్పంచ్ మాదల సింహాచలం అన్నారు. మండలంలోని గొట్టూరు రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న పంట వైపు మళ్లుతున్నారని, నీటి సదుపాయం లేని మొక్కజొన్న ఆర్థికంగా లాభదాయకంగా ఉండదని, దాని స్థానంలో ఎలాంటి ఖర్చులు లేని చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలు అందిస్తుందని, అలాగే కంది పంట చిరు సంచులను ఉచితంగా అందజేస్తుందని కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ 20 మంది వరకు పిఎం కిసాన్ లబ్ధిదారులకు లబ్ధి చేకూరలేదని, అలాగే ఈ ఏడాది ఉలవ పంటకు మద్దతు ధరతో కొనుగోలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, విఎఎలు భారతి, కిరణ్, ప్రకృతి సేద్య ఉద్యోగులు సురేష్, అప్పన్న, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం: విత్తనాల తయారీలో మెలకవలు పాటిస్తే తెగుళ్ల నివారించవచ్చునని స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని చలివేంద్రిలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమం ఆమె మాట్లాడారు. రైతులు ముందుగా విత్తనాలను బీజామృతంతో సిద్ధం చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సిహెచ్ ఉమామహేశ్వరరావు, శశి కుమార్, ఎ.కృష్ణంనాయుడు, కోడూరు శ్రీనివాసరావు, విఎఎ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.